ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శనివారం, 8 ఫిబ్రవరి 2025



కొత్త ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ప్రారంభం కాబోతున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు చేపట్టబోయే పనులకు ప్రణాళికలు రూపొందించారు. అయితే గతంలో కంటే ఈసారి భిన్నంగా ఈజీఎస్ పనులకు డిమాండ్ రాబోతుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం ఉపాధి హామీ పథకం పనులకు అనుసంధానం చేయడంతో ఈసారి ఎక్కువ మంది పనుల్లో పాల్గొనే అవకాశం నెలకొంది. అయితే కొత్త జాబ్‌కార్డుల మంజూరు మాత్రం ఇంకా ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. పాత జాబ్ కార్డులతోనే ప్రస్తుతం పనులు సాగుతున్నాయి.



ఊపందుకోనున్న ఉపాధి పనులు

- ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో ఈజీఎస్ పనులపై ఆసక్తి
- ఖమ్మంలో 3.06 లక్షల జాబ్ కార్డులు
- భద్రాద్రి కొత్తగూడెంలో 2.19లక్షలు...
- ఇరుజిల్లాల్లో మొత్తం 1.18 కోట్ల పని దినాల లక్ష్యం

కొత్త జాబ్‌కార్డులపై ఇంకా వెలువడని నిర్ణయం

ఖమ్మం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో 3.06లక్షల మంది జాబ్‌కార్డులు తీసుకోగా, కేవలం లక్షా73 వేల మంది మాత్రమే ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. భద్రాద్రి జిల్లాలో 2.19లక్షల జాబ్‌కార్డులు ఉన్నప్పటికీ లక్షా35వేల మంది మాత్రమే పనుల్లో పాల్గొంటున్నారు. అయితే ఈసారి రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం ప్రవేశపెట్టి ప్రతీ సంవత్సరం రూ.12వేల చొప్పున మంజూరుకు పథకానికి శ్రీకారం చుట్టింది. ఏడాదిలో రెండుసార్లు రూ.6వేల చొప్పున రూ.12వేలు అందించనున్నారు. కనీసం ఏడాదిలో 20రోజుల్లో ఉపాధి పనుల్లో పాల్గొని ఉండాలని నిబంధనలు విధించడంతో కొద్దిమందికి మాత్రమే అర్హత లభించింది. ఈసారి ఉపాధి పనుల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు ఏడాదిలో 20 రోజుల వరకు పనుల్లో పాల్గొనే పరిస్థితి కనిపిస్తుంది.

పెరిగిన అంచనాలు...

రాష్ట్ర ప్రభుత్వం కొత్త జాబ్ కార్డులకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. ప్రస్తుతం పాతకార్డులు ఉన్న వారికి ఉపాధి పనులు నడుస్తున్నాయి. ఖమ్మంజిల్లాలో సుమారు 68 లక్షల పని దినాలకు గాను 64 లక్షల పనిదినాలు కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.109 కోట్ల విలువైన పనులు చేపట్టారు. కాగా కొత్త ఆర్థిక ఏడాదిలో అదే 68 లక్షల పనిదినాలను లక్ష్యంగా ఉంచారు. కనీసం 2.28లక్షల మందికి ఉపాధి హామీ కింద పని దినాలు కలిపించేందుకు ప్రణాళిక రూపొందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 45.70లక్షల పనిదినాలు ఉపాధి పనులు నిర్వహించారు. సుమారు రూ.105 కోట్లు ఖర్చు చేశారు. వచ్చే ఏడాది సుమారు 50 లక్షల పనిదినాలు లక్ష్యంగా పెట్టుకుని సుమారు రూ.115కోట్ల విలువైన పనులు నిర్వహించాలని లక్ష్యం పెట్టుకోవడం జరిగింది. మొత్తంమీద, ఈసారి ఉపాధి హామీ పనులకు ఇందిరమ్మ ఆత్మీయభరోసాతో డిమాండ్ ఏర్పడింది. కొత్తజాబ్‌కార్డులు తీసుకునేందుకు గ్రామాల్లో కూలీలు ఉత్సాహం చూపుతున్నారు.

మార్కెట్ కమిటీలకు కాసుల వర్షం

- లక్ష్యాన్ని దాటేసిన వైరా, కల్లూరు, సత్తుపల్లి, మద్దులపల్లి మార్కెట్‌లు
- మార్చి నెలాఖరుకు మిగతా కమిటీల టార్గెట్లు పూర్తయ్యే అవకాశం
- ఇప్పటి వరకు ఖజానాకు చేరిన 80 శాతం ఫీజు



ఖమ్మం మార్కెట్ ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయాలు టాప్ గేర్‌లో దూసుకుపోతున్నాయి. మార్కెట్ కమిటీలకు ఈ ఏడాది రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన మార్కెట్ ఆదాయం టార్గెట్‌ను నూటికి నూరు శాతం లక్ష్యాన్ని ఛేదించే దిశగా మార్కెట్ కమిటీలు పరిగెడుతున్నాయి.

జిల్లాలో ప్రధానంగా ఖమ్మం, మధిర, నేలకొండపల్లి, కల్లూరు, వైరా, ఏన్కూరు, సత్తుపల్లి, మద్దులపల్లి తదితర 8 మార్కెట్ కమిటీలకు 2024-2025 సంవత్సరానికి గాను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ రూ. 54.35 కోట్ల మార్కెట్ ఆదాయాన్ని సమకూర్చాలని టార్గెట్‌గా నిర్దేశించింది. అయితే జిల్లాలోని మార్కెట్ కమిటీలు సీజన్ ప్రారంభంలో కొంత తడబడినప్పటికీ ఇప్పటి వరకు సుమారు రూ. 44.70 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకోవడం విశేషం. కాగా ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు అంటే మార్చి 31 నాటికి ఇంకా లక్ష్యంలో రావాల్సిన మొత్తం రూ. 10 కోట్ల లక్ష్యాన్ని సులువుగానే సమకూర్చుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మార్కెట్‌లకు ముఖ్యంగా యార్డులలో జరిగే క్రయవిక్రయాలపై కేవలం 1 శాతం ఫీజు (మిగతా 6వ పేజీలో)

ఇప్పటి వరకు మార్కెట్ కమిటీలు సాధించిన ఆదాయ వివరాలు (జనవరి 31 వరకు)

మార్కెట్ కమిటీలు	లక్ష్యం	ఆదాయం
ఖమ్మం	30.00 కోట్లు	19.70కోట్లు
మధిర	4.30 కోట్లు	3.52 కోట్లు
నేలకొండపల్లి	2.75 కోట్లు	2.60 కోట్లు
కల్లూరు	3.20 కోట్లు	4.91 కోట్లు
వైరా	4.25 కోట్లు	5.33 కోట్లు
ఏన్కూరు	4.68 కోట్లు	2.93 కోట్లు
సత్తుపల్లి	3.50 కోట్లు	3.88 కోట్లు
మద్దులపల్లి	1.67 కోట్లు	1.79 కోట్లు



నెల్లిపాక సీసీఐ కేంద్రంలో పత్తి విక్రయాల దృశ్యం

నకిలీ మకిలీ

- జిరాక్స్ టీఆర్‌లతో సీసీఐకి టోకరా
- రైతుల పేరిట వ్యాపారుల విక్రయాలు
- ఏఈవోనే ప్రధాన సూత్రధారి
- విజిలెన్స్ విచారణతో వెలుగులోకి..
- నెల్లిపాక కేంద్రంగా దందా

అశ్వాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నకిలీ తాత్కాలిక రిజిస్ట్రేషన్‌ల(టీఆర్) కాటన్ కార్పొరేషన్‌కే కొందరు టోకరా వేశారు. నకిలీ టీఆర్‌లతో దర్జాగా రైతుల పేరిట సీసీఐలో వ్యాపారులు విక్రయాలు జరుపుతున్నారు. నెల్లిపాక సీసీఐ కొనుగోలు కేంద్రంగా ఈ దందా కొనసాగగా విజిలెన్స్ విచారణతో వెలుగులోకి వచ్చింది. ఈ దందాకు మండలంలో పనిచేస్తున్న రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఒక ఏఈవో (మండల వ్యవసాయ విస్తరణాధికారి)ప్రధాన సూత్రదారిగా విజిలెన్స్‌తో పాటు, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు నిగ్గుతేల్చారు. రేపో మాపో సదరు ఏఈవోపై పై సస్పెన్షన్ వేటు పడనున్నట్లు సమాచారం.

కలర్ జిరాక్స్‌తో టీఆర్‌లు..

సీసీఐలో పత్తిని విక్రయించేందుకు రైతులకు టీఆర్ ఉండాలి. ఈ టీఆర్‌లను సంబంధిత మార్కెట్ కమిటీ ముద్రించి వ్యవసాయాధికారులకు అందజేస్తుంది. ఏవోలు వీటిని పరిశీలించి జారీ చేసే అధికారాన్ని ఏఈవోలకు అప్పగిస్తారు. ఇదే అదనుగా భావించిన మండలానికి చెందిన ఒక ఏఈవో తనకు టీఆర్‌లు జారీ చేసే అనుమతిని అధికారులు ఇవ్వకున్నా, మార్కెట్ కమిటీ ముద్రించిన టీఆర్‌లను సేకరించి వాటిని కలర్ జిరాక్స్ తీయించారు. మండలంలోని వ్యాపారులతోపాటు పలువురు రైతులకు కమీషన్లు తీసుకుని నకిలీ టీఆర్‌లు ఇచ్చారు. నెల్లిపాక సీసీఐతోపాటు ఇతర కేంద్రాల్లో కూడా పత్తి విక్రయాలు జరిగినట్టు సమాచారం.

శాఖాపరమైన విచారణ

విజిలెన్స్ అధికారులు అనుమానంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న సీసీఐ కేంద్రాల్లోని టీఆర్‌లను మరోసారి పరిశీలించారు. బూర్గంపాడు, అశ్వాపురం మండలంలో రామచంద్రాపురం గ్రామాల్లోని టీఆర్‌లపై విజిలెన్స్ అధికారులకు అనుమానం రావటంతో వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రైతులు సమర్పించిన టీఆర్‌ల వివరాలకు, సీసీఐ కొనుగోలు చేసిన పత్తి వివరాలకు మధ్య వ్యత్యాసం ఉంది. దీంతో వ్యవసాయ ఉన్నతాధికారులు దీనిపై శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తూ మణుగూరు ఏడీఏ తాతారావు, మండల వ్యవసాయాధికారి సాయి శంతన్‌కుమార్‌లను విచారణాధికారులుగా నియమించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు

- పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు షెడ్యూల్ విడుదల
- కసరత్తు చేస్తున్న జడ్పీ, మండల పరిషత్ అధికారులు



పోలింగ్ సామగ్రిని మండలాల వారీగా విభజిస్తున్న సిబ్బంది

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ఎన్నికలకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీల కంటే ముందుగానే ఎన్నికలు నిర్వహించాలన్న సూచనప్రాయ అభిప్రాయంతో జడ్పీ, మండల పరిషత్ అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై షెడ్యూల్‌ను శుక్రవారం ఖరారు చేసింది. జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీల్లో ఓటర్ల జాబితాలు ఇప్పటికే రూపొందించారు. ఖమ్మం జిల్లాలో 20 మండల పరిషత్లలో 288 ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేశారు. గ్రామ పంచాయతీల వారీగా రూపొందించిన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 8,64,702 మంది ఓటర్లున్నారు. దీనికి అనుబంధ జాబితాలో మరో 4,167 మంది ఓటర్లు పెరగనున్నారు. గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా సిద్ధం చేసిన ఓటర్ల జాబితా ఆధారంగా ఎంపీటీసీ(మండల ప్రాదేశిక నియోజకవర్గం)ల్లో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు.

500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం

ఎంపీటీసీల్లో ప్రతి 500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం సూచించిన నేపథ్యంలో గతంలో 1615 పోలింగ్ కేంద్రాలున్నాయి. ప్రస్తుతం ఓటర్ల సంఖ్య ఆధారంగా ప్రతి పోలింగ్ కేంద్రానికి 500 మంది ఓటర్లు ఉండేలా చేస్తే మరిన్ని పోలింగ్ కేంద్రాలు పెరిగే ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో 10వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను సిద్ధం చేసి 11న ప్రచురిస్తారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో జాబితాను ప్రదర్శనకు పెడతారు. 11 నుంచి 13వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 14న అభ్యంతరాలను పరిష్కరించి కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ ఆమోదానికి పంపిస్తారు. 15న తుదిజాబితాను ప్రచురిస్తారు.

మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాలు ఇలా :

జిల్లాలో 20 మండలాల్లో 288 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలున్నాయి. బోనకల్లు-13, చింతకాని-14, ఏన్కూరు-10, కల్లూరు-18, కామేపల్లి-12, ఖమ్మం రూరల్-14, కొణిజర్ల-15, కూసుమంచి-17, మధిర-12, ముదిగొండ-17, నేల కొండపల్లి-18, పెనుబల్లి-15, రఘునాథపాలెం-13, సత్తుపల్లి-13, సింగరేణి-16, తల్లాడ-16, తిరుమలాయపాలెం-18. వేంసూరు-13, వైరా-10, ఎర్రుపాలెం మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలున్నాయి. జిల్లా పరిషత్ పరిధిలో 20 ప్రాదేశిక నియోజకవర్గాలున్నాయి.



సింగరేణిలో ఖాళీగా రెండు డైరెక్టర్ పోస్టులు

రుద్రంపూర్ (సింగరేణి), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కీలకమైన రెండు డైరెక్టర్ల పోస్టులు వారం రోజులుగా ఖాళీగా ఉన్నాయి. ప్రధానమైన డైరెక్టర్ (పా) పోస్టుతోపాటు డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్‌లో పని చేసిన వెంకటేశ్వరరెడ్డి పదవీ కాలం ఈ నెల 1వ తేదీతో ముగిసింది. డైరెక్టర్ ఈఅండ్ఎంగా పని చేస్తున్న సత్యనారాయణరావుకు డైరెక్టర్ ఆపరేషన్ అదనపు బాధ్యతలను యాజమాన్యం అప్పజెప్పింది. సింగరేణిలో డైరెక్టర్ల పోస్టుల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉంది.

సింగరేణి డైరెక్టర్ పోస్టుల కోసం మణుగూరు జీఎం దుర్గం రాంచందర్, శ్రీరాంపూర్ జీఎం ఎల్‌వీ.సూర్యనారాయణ, మందమర్రి జీఎం దేవేందర్, కార్పొరేట్ జీఎం సాయిబాబు, అడ్రియాల ప్రాజెక్టు జీఎం కొప్పుల వెంకటేశ్వర్లతోపాటు ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న మరో జనరల్ మేనేజర్ పోటీ పడుతున్నారనే ప్రచారం సాగుతోంది.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

విద్యార్థులకు అందించే సౌకర్యాలు మెరుగుపరచాలి

కలెక్టర్ జితేష్ వి. పాటిల్

పాల్వంచ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ గురుకుల వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే సౌకర్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పాల్వంచలోని ఆశ్రమ గురుకుల వసతిగృహాన్ని ఆయన సందర్శించారు.ముందుగా డైనింగ్‌హాల్, తరగతి గదులు, పరిసరాలు, మరుగుదొడ్లు, వంటగది తదితరాలను పరిశీలించారు. పరిశీలనలో భాగంగా విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని విద్యార్థులను అడిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సౌకర్యాలను మెరుగుపరచడానికి కావలసిన ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ వెంట ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, పాఠశాల హెచ్ఎం భద్రు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులతో మర్యాదగా మెలగాలి

- వైద్యులు సమయం పాటించాలి
- ఐటీడీఏ పీవో రాహుల్



వైద్యశాఖ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న పీవో
8



మాట్లాడుతున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

క్రీడలకు వయస్సు అడ్డుకాదు

- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు
- రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ వెటరన్స్‌కు బహుమతుల ప్రదానం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు వయస్సు అడ్డుకాదని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలో కొనసాగుతున్న రాష్ట్రస్థాయి పదో షటిల్ బాడ్మింటన్ క్రీడల్లో రెండోరోజు వెటరన్ విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఏదైనా ఆట ఆడితే.. వ్యాయామంతో పాటు ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. అందరూ గంట ఆరోగ్యం కోసం శ్రమించా లన్నారు. గెలుపోటములకు అతీతంగా క్రీడాస్ఫూర్తితో రాణించాలని కోరారు. తెలంగాణ పోలీస్ అకాడమీ అడిషనల్ ఎస్పీ వెంకటరావు మాట్లాడారు. రెండోరోజు జరిగిన క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ సతీమణి స్వరూప పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ డాక్టర్ సావిత్రి, ట్రెజరర్ రమేష్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వెంకన్న, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యుగేంధర్‌రెడ్డి, కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సభ్యులు మహిదర్, హసన్, యాకూబ్‌పాషా, సుధాకర్ పాల్గొన్నారు.

విశ్రాంత సీఈకి

పీహెచ్‌డీ ప్రదానం



సత్తుపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ నీటి పారుదల శాఖలో చీఫ్ ఇంజనీర్, గత ప్రభుత్వ సలహాదారు హరి ఉమాకాంత రావుకు పీహెచ్‌డీ ప్రదానం చేసారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఫ్లోరిడా ఇంటర్నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ, మహర్షి కాలేజి ఆఫ్ ఆస్ట్రాలజీ ఆధ్వర్యంలో జోతిష్యశాస్రంలో పీహెచ్‌డీ (డాక్టరేట్) ప్రదానం చేసి, బంగారు పతకంతో సత్కరించారు. జ్యోతిష్యం, వాస్తులో మూఢనమ్మకాలు, అపోహలు అనే అంశంపై ఆయన పరిశోధన చేసారు. ఖమ్మం జిల్లాలో జన్మించి విద్యాభ్యాసం పూర్తి చేసి వరంగల్‌రీజినల్ ఇంజనీరింగ్ కాలేజిలో ఇంజనీరింగ్ పూర్తి చేసారు. నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజనీర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి తాలిపేరు ప్రాజెక్టు సర్వే, నిర్మాణ బాధ్యతల్లో పాల్గొన్నారు. 1986లో గిరిజన సంక్షేమ శాఖ పని చేసారు. 1997 నుంచి జిల్లాలో గ్రామీణ నీటి పారుదల శాఖలో కార్యనిర్వాహక ఇంజనీర్‌గానూ పర్యవేక్షక ఇంజనీర్‌గానూ పని చేసారు. వివిధ మాధ్యమాల్లో కొందరు జ్యోతిష్యం, వాస్తు పేరుతో తప్పుదారి పట్టిస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని వాస్తవం ఏమిటనే అంశంపై పరిశోధన చేసారు. ఈ సందర్భంగా ఉమాకాంతరావు మాట్లాడుతూ సమాజంలో జ్యోతిష్యం, వాస్తు పేరుతో జరుగుతున్న మోసాలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో జ్యోతిష్యంలో ప్రాథమిక విషయాలు-దోషాలు, అపోహలు-వాస్తవాలు అనే పుస్తకాన్ని రాసినట్లు చెప్పారు. డాక్టరేట్ పొందిన హరి ఉమాకాంతరావును జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

భారతీయులకు సంకెళ్లపై

మోదీ మౌనం వీడాలి

- ఖమ్మంలో పీడీఎస్‌యూ నిరసన
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మ దహనం



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని భారతీయులకు సంకెళ్లు వేసి తిరిగి పంపుతున్నా.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మౌనం వీడటం లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ ఆరోపించారు. భారతీయ విద్యార్థుల పట్ల అమెరికా వైఖరిని నిరసిస్తూ శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ పీజీ కాలేజీ ఎదుట నిరసన తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. భారత్‌కు అమెరికా మిత్రదేశమని ఎంతో గొప్పలు చెప్పిన మోదీ.. ఇప్పుడేందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, సాధిక్, నసీర్, విగ్నేష్, రఫీ, అనూష, అఖిల, సంధ్య, స్పందన, సింధూ పాల్గొన్నారు.

ట్రంప్‌కు దురహంకారం పెరిగింది

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్‌కు దురహంకారం పెరిగిందని, అందుకే భారతీయ ప్రజల్ని, విద్యార్థులను తిరిగి పంపుతున్నారని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఖమ్మంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇంతదారుణం జరుగుతున్నా.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అనేక దేశాల వలస ప్రజల కష్టంతోనే అమెరికా అభివృద్ధి చెందిందనే విషయాన్ని ట్రంప్ మరిచిపోయారని విమర్శించారు. భారత ప్రజలు ఇంతటి అవమానకర పరిస్థితి గతంలో ఏ దేశంలో ఎదుర్కోలేదని కేంద్ర విదేశాంగ మంత్రి జయశంకర్ పార్లమెంట్‌లో అమెరికా నిర్ణయాన్ని సమర్థించటాన్ని ఖండించారు.



ఆందోళనలో పరిసర గ్రామాల ప్రజలు

పులిగుండాలలో పులి సంచారం

పెనుబల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పులిగుండాల ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో పులి సంచారాన్ని అధికారులు శుక్రవారం నిర్ధారించారు. కనకగిరి గుట్టల్లోని అటవీ ప్రాంతంలో అంతర్భాగమైన పులిగుండాల ప్రాజెక్టు పరిసరాల్లో గురువారం పులి సంచరించినట్లు గ్రామస్థులు ఆందోళన చేయడంతో శుక్రవారం తల్లాడ ఎఫ్ఆర్వో ఉమ, డిప్యూటీ రేంజర్ సురేష్, పెనుబల్లి మండల తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, ఎస్ఐ వెంకటేష్‌లు పులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించి కాలిముద్రలను గుర్తించారు. పులిగుండాల సమీపంలో కుక్కలను వేటాడుతూ గ్రామసమీపంలో ఉన్న మామిడితోట వరకు పులి సంచరించినట్లు అధికారులు ఒక నిర్థారణకు వచ్చారు. పులి వయస్సు సుమారు మూడేళ్లు ఉంటుందని కాలిముద్రలను బట్టి అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. పులి గ్రామ సమీపంలో సంచరించడంతో అటవీ ప్రాంత గ్రామాలైన బ్రాహ్మలకుంట, బత్తులపల్లి, తాళ్లపెంట తదితర గ్రామాల్లోని ప్రజలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు గ్రామాల్లో మైకుల ద్వారా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవోలు భరత్‌కుమార్, భీమా, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో

ఇద్దరు యువకుల దుర్మరణం

పువ్వాడ ఉదయ్‌నగర్‌లో విషాదఛాయలు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వెళ్లిన యువకులు మరి కొద్ది నిమిషాల్లో స్వగృహానికి చేరుకునే లోపుగానే మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఇద్దరు యువకులు సమీప బంధువులు కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రఘునాథపాలెం మండలం బూడిదంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద సంఘటన స్థానికంగా విషాదఛాయలు నింపింది. సీఐ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. పువ్వాడ ఉదయ్‌నగర్‌కు చెందిన తేజావత్ విజయ్ (23), భూక్యా వినోద్ (24) అక్కా, చెల్లెళ్ల పిల్లలు. సమీప బంధువుల నివాసంలో ఓ కార్యక్రమానికి సింగరేణి మండలం పేరుపల్లికి శుక్రవారం ఉదయం వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మరో ఐదు కి.మీ. దూరంలో పువ్వాడ ఉదయ్‌నగర్‌కు చేరుకోవాల్సి ఉంది. బూడిదంపాడు వద్దకు రాగానే బైక్‌ను ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తేజావత్ విజయ్, భూక్యా వినోద్ ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే కన్నుమూశారు. విషయం తెలుసుకున్న సీఐ షరిప్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



ప్రమాద స్థలంలో మృతదేహం

21న హమాలీ కార్మికుల రాష్ట్ర మహాసభలు

రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఖమ్మంసంక్షేమ విభాగం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రగతిశీల హమాలీ కార్మికుల సంఘం యూనియన్ 4వ రాష్ట్ర మహాసభలు ఈనెల 21నఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ప్రకటించారు. శుక్రవారం ఖమ్మంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 5 లక్షలకు పైగా హమాలీలు ఎగుమతి, దిగుమతి రంగాల్లో పనిచేస్తున్నారన్నారు. వ్యవసాయ మార్కెట్‌లు, సివిల్ సప్లయీస్ గోదాములు, మార్బుల్స్, ఆర్టీసీ రంగాల్లో పని చేస్తున్న హమాలీలు వెట్టిచాకిరికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీల చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణకు టీయూసీఐ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఏర్పాటు చేశామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్ల య్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు కే.శ్రీనివాస్, బొమ్మకంటి రమేశ్, శోభన్, లచ్చయ్య, శ్రీను, నాగేశ్వరరావు, సత్యం, సీతయ్య పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులకు తాతా మధు పిలుపు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధు

కారేపల్లి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ క్షణంలోనైనా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, అందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని భాగ్యనగర్ తండాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతుందని, అప్పుడే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక మంత్రులు తలో ప్రకటనలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. ఎక్కడ విన్న మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని, కేసీఆరే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన అన్నారు. రైతులకు ఇవ్వాల్సిన రైతుభరోసా, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం ఇంతవరకు అందించలేదన్నారు. ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డబ్బుల మూటలు చేరవేయడంతోనే సరిపోతుందన్నారు. రైతుల వద్ద నుంచి వరిధాన్యానికి మద్దత ధర ఇస్తామన్నారు. క్వింటాకు ఐదు వందలు రూపాయలు బోనసు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పటికి సగం రైతులకు బోనస్ డబ్బులు రాలేదన్నారు. ప్రభుత్వంపై ఎవరైనా విమర్శలు చేస్తే వారిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నట్లు తాతా మధు వాపోయారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు క్వింటా మిర్చి ధర రూ.25వేలు ఉండగా, ఇప్పుడు రూ.12వేలు ధర కూడా లేదన్నారు. దీంతో రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందన్నారు.

మాజీ జడ్పీటీసీ జగన్‌ను పరామర్శించిన మధు

ఇటీవల రోడ్డు ప్రమాధంలో కాలు విరిగి భాగ్యనగర్ తండాలో ఉంటున్న మండల మాజీ జడ్పీటీసీ వాంకుడోత్ జగన్‌ను ఎమ్మెల్సీ తాతా మధు పరామర్శించారు. తాతా మధు వెంట మాజీ జడ్పీటీసీలు మూత్యాల సత్యనారాయణ, ఉన్నం వీరేందర్, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, జిల్లా యూత్ కమిటీ నాయకులు మూత్యాల వెంకట అప్పారావు, సొసైటీ వైస్ చైర్మన్ మంగీలాల్, బత్తుల శ్రీనివాసరావు, అడప పుల్లారావు, శివరాత్రి అచ్చయ్య, రాందాస్‌నాయక్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విరాట్ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం

- భద్రాద్రిలో చిన్నజీయర్‌స్వామి పర్యవేక్షణలో నిర్వహణ
- సిద్ధమైన జూనియర్ కళాశాల క్రీడామైదానం వేదిక
- ఏర్పాట్లను పరిశీలించిన దేవనాధ జీయర్ స్వామి, నిర్వాహకులు

భద్రాచలం, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో శనివారం విరాట్ విష్ణు సహస్రనామసోత్ర పారాయణం నిర్వహించనున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని వికాస తరంగిణి, జీయర్‌మఠం ఇతర ఆధ్యాత్మిక సంస్థలు నిర్వహించనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. విరాట్ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణంను పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం వేదిక సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు, వేద పండితులు, వైదిక సిబ్బంది కోసం ప్రత్యేక గ్యాలరీలను పక్కా ప్రణాళికతో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. కాగా రామాలయం నుంచి మంగళవాయిద్యాలు, కొమ్ము నృత్యం, కోలాటం, హరిదాసులు, భజన బృందాలు, బాలల విచిత్ర వేషదారణలతో శోభాయాత్ర సాగనుంది. ఈ శోభయాత్ర అగ్రభాగాన చిన జీయర్‌స్వామి పాల్గొననున్నారు. భద్రాచలంలోని రాజవీధి, సూపర్‌బజారు సెంటరు, గోపాలకృష్ణ రోడ్డు, ఆఫీసర్స్ క్లబ్, బ్రిడ్జిసెంటర్ అంబేద్కర్ సెంటర్, కూనవరం రోడ్ల మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం శోభాయాత్ర చేరనుంది.

భక్తులతో పారాయణం చేయించనున్న చినజీయర్‌స్వామి

విష్ణుసహ్రనామ స్తోత్రపారాయణం సాయంత్రం ప్రారంభం కానుండగా చినజీయర్ స్వామి భక్తులతో ఈ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహింపజేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. అలాగే ప్రభుత్వ వైద్యఆరోగ్యశాఖ రెండు చోట్ల ప్రాథమిక చికిత్స కేంద్రాలు, ఒక అగ్నిమాపక యంత్రం సిద్ధంగా ఉండనుంది. గ్రామ పంచాయతీ వారి సహకారంతో వికాస తరంగిణిశాఖ 20కేంద్రాల్లో మంచి నీటి సరఫరా ఏర్పాట్లు చేపట్టగా సత్యసాయి సేవా సంస్థలు ఆ సేవలను అందజేయనున్నారు. భక్తులకు ఉచితంగా పుస్తకాలను వికాస తరంగిణి సంస్థలు అందజేయనున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 25వేల మంది భక్తులకు వస్తారనే అంచనా ఉంది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

మందకొడిగా ఇంటి పన్నుల వసూళ్లు..

- భద్రాద్రి జిల్లాలో 44.57శాతం మాత్రమే వసూలు
- కార్యదర్శులకు అదనపు పనుల బరువు
- 481 పంచాయతీలకు,120 పంచాయతీలోనే వందశాతం

జూలూరుపాడు,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధికి పన్నుల ద్వారా లభించే ఆదాయమే ఆధారం.. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పన.. పారిశుధ్య పనులు.. రహదారుల మరమ్మతులు.. విద్యుత్ దీపాలు.. పంచాయతీ కార్యాలయాల నిర్వహణ.. ప్రభుత్వ కార్యక్రమాల ఏర్పాటు..కార్మికుల జీతభత్యాలు.. తదితరాలను ఇంటి పన్నుల రూపంలో వసూళ్ల చేసే సొమ్ముతోనే చక్కపెట్టుకోవాలి. అలాంటి కీలకమైన ఇంటి పన్నుల వసూళ్ల కార్యక్రమం భద్రాద్రి జిల్లాలో నత్తనడకన సాగుతోంది..

నిధుల విడుదల్లో ప్రభుత్వాలు జాప్యం..

పంచాయతీలకు అందించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు సకాలంలో అందక, గ్రామాల్లో ఇంటిపన్నులు వసూళ్ల కాక పంచాయతీల్లో నిధుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో పంచాయతీ కార్యదర్శులు కార్యక్రమాలు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు కార్యదర్శులు సొంతసొమ్మును వెచ్చించి పనులను చేయించడం గమనార్హం.

మందకొడిగా పన్నుల వసూళ్లు..

భద్రాద్రి జిల్లాలో 23 మండలాల పరిధిలో 481గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా రూ.14,95,35,840 ఇంటి పన్నులను వసూళ్ల చేయాల్సి ఉంది. వందశాతం లక్ష్యాన్ని మార్చి 31నాటికి పూర్తి చేయాల్సి ఉంది. కాగా ఇప్పటి వరకు రూ.6,66,53,652 మాత్రమే వసూళ్ల చేశారు. ఇంక రూ.8,28, 82,188 వసూళ్ల చేయాల్సి ఉంది. జూలూరుపాడు మండలంలో రూ. 23.34లక్షలను వసూళ్ల చేయాల్సి ఉండగ ఇప్పటివరకురూ.15.33లక్షలు జమ అయ్యాయి. ఇంకా రూ.8లక్షలు వసూళ్ల కావాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు 44.57శాతం మాత్రమే పన్నులు వసూళ్ల అయ్యాయి. అళ్లపల్లి మండలంలో అత్యధికంగా 91శాతం వసూలు కాగా భద్రాచలంలో 10.33శాతం మాత్రమే వసూళ్ల చేశారు. జిల్లాలో 481 పంచాయతీల్లో కేవలం 120 పంచాయతీలోనే వందశాతం పన్నుల వసూళ్లను పూర్తి చేశారు. ఇంకా 361 పంచాయతీల్లో పన్నులను వసూళ్ల చేయాల్సి ఉంది.

జూలూరుపాడులో

జూలూరుపాడు మండలంలో 24పంచాయతీలకు 8పంచాయతీల్లోనే వందశాతం పన్నుల వసూళ్ల పూర్తి చేశారు. భద్రాచలం, బూర్గంపాడు, చంద్రుగొండ, పినపాక మండలాల్లో ఒక్క పంచాయతీలో కూడా వంద శాతం పన్నుల వసూళ్లను పూర్తి చేయలేదు. వీటిని బట్టి చూస్తే పన్నుల వసూళ్లలో భద్రాద్రి జిల్లా వెనుకబడి ఉందని తెలుస్తోంది.



వెంగన్నపాలెంలోని పంచాయతీ కార్యాలయం

గడువు ముగిసేలోగా లక్ష్యం సాధ్యమేనా?

పన్నుల వసూళ్లకు గడువు సమీపిస్తున్న తరుణంలో కార్యక్రమం మందకొడిగా సాగుతోంది. ఇంక 52రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది. ఆ సమయానికి ఇంటి పన్నుల వసూళ్ల వందశాతం పూర్తి అయ్యే అవకాశం కనిపించడం లేదు. పంచాయతీ కార్యదర్శులు వివిధ ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాల్లో నిమగ్నం కావడంతో పన్నుల వసూళ్లపై కేంద్రం దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. అదనపు పనుల భారంతో కార్యదర్శులు సతమతమవుతున్నారు. ఇంటి పన్నుల వసూళ్ల కోసం వారు పూర్తి సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. ఇదిలా ఉండగ స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి ప్రారంభం కావడంతో గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లకు ప్రతిబంధకాలు ఏర్పడే అవకాశాలు ఉంది. ఈ నేపథ్యంలో గడువు ముగిసే నాటికి నిర్ధేశించిన లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమేనని అనివిస్తోంది.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించాం..
చంద్రమౌళి, డీపీవో భద్రాద్రి జిల్లా



జిల్లాలో ఇంటి పన్నుల వసూళ్ల పక్రియ ఆశించిన స్థాయిలో సాగడం లేదు.. ప్రభుత్వ కార్యక్రమాలు, స్థానిక సంస్థల ఎన్నికల కార్యక్రమాల పనుల్లో కార్యదర్శులు నిమగ్నం కావడంతో పన్నుల పక్రియ మందకోడిగా సాగుతోంది. ఇప్పటివరకు జిల్లాలో 44.57శాతం మాత్రమే వసూళ్ల అయ్యాయి. పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కార్యదర్శులను ఆదేశించామని గడువు నాటికి లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

మార్కెట్ కమిటీలకు కాసుల వర్షం

(5వ పేజీ తరువాయి)

వసూలుతోనే అత్యధిక ఆదాయం సమకూరుతుంది. అంతేకాకుండా మార్కెటింగ్ శాఖకు అనుబంధంగా ఉన్న జిన్నింగ్ మిల్లులు, రైస్ మిల్లులు, వ్యవసాయ చెక్‌పోస్టులు, శీతలగిడ్డంగులు, ధాన్యం, కూరగాయల మార్కెట్‌లతో పాటు పేపర్ మిల్లులకు వెళ్లే సుబాబుల్, జామాయిల్ రవాణాపై సైతం మార్కెట్ ఫీజు మార్కెట్ ఖజానాకు చేరుతుంది.

లక్ష్యాన్ని దాటేసిన నాలుగు కమిటీలు

జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నిర్ధేశించిన ఆదాయం టార్గెట్ మేరకు సత్తుపల్లి, వైరా, కల్లూరు, మద్దులపల్లి మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని దాటి ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చుకోవడం విశేషం. సత్తుపల్లి మార్కెట్‌కుఈ ఏడాది నిర్దేశించిన రూ. 3.50 కోట్లకు గాను రూ. 3.88 కోట్లు, వైరా మార్కెట్ కమిటీకి నిర్దేశించిన రూ. 4.25 కోట్లకు గాను రూ. 5.33 కోట్లు, కల్లూరు మార్కెట్‌క నిర్దేశించిన రూ. 3.20 కోట్లకు గాను రూ. 4.91 కోట్లు, మద్దులపల్లి మార్కెట్ కమిటీకి నిర్దేశించిన రూ. 1.67 కోట్లకు గాను రూ. 1.79 కోట్లు అదనంగానే ఆదాయం సమకూర్చుకున్నాయి. కాగా ఆయా మార్కెట్ కమిటీలు మార్చి నెలాఖరు కల్లా మరి కొంత ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

టార్గెట్‌లో వెనకబడ్డ ఖమ్మం

ఆదాయ లక్ష్య ఛేదనలో ఈ ఏడాది ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కొంత మేర వెనకబడినట్లు అధికారిక అంచనాలు చెబుతున్నాయి. మార్కెట్‌కు ఈఏడాది నిర్దేశించిన టార్గెట్ ఆదాయం రూ. 30 కోట్లకు గాను ఇప్పటివరకు రూ. 19.70 కోట్లు మాత్రమే వసూలు చేసింది. మిగితా సుమారు రూ. 10.30 కోట్లను మార్చి 31 కల్లా సమకూర్చుకోగలుగుతామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది మిర్చి ధరలు తక్కువగా ఉండటం కూడా ఆదాయం తగ్గడానికి ముఖ్య కారణమని అధికారులు పేర్కొంటున్నారు.

కష్టతరంగా ఉన్నా లక్షాన్ని ఛేదిస్తాం

పి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, ఖమ్మం వ్యవసాయ మార్కెట్

ఈ ఏడాది రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీకి నిర్ధేశించిన టార్గెట్‌ను మార్చి నెలాకరు వరకు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది మిర్చి పంటకు ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో మార్కెట్ ఫీజు వసూలులో కొంత వెనకబడ్డ మాట వాస్తవం. అయినా సరే ప్రతి వ్యాపారికి చెందిన మార్కెట్ ఫీజును సకాలంలో వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకుంటాం.

కారు, బైక్ ఢీ : ఒకరి మృతి

డోర్నకల్(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): కారు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓవ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై గడ్డం ఉమ శుక్ర వారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా రఘునాథ పాలెం మండలం పాపటపల్లికి చెందిన వడ్డె వేణు (38) డోర్నకల్ నుంచి ద్విచక్రవాహనంపై తన సొంతూరు పాపటపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో డోర్నకల్ వైష్ణవి మిల్క్‌ప్లాంట్ సమీపంలో ఖమ్మం వైపు నుంచి గార్ల వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈఘటనలో వేణు కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్సనిమిత్తం ప్రైవేట్ వాహనం ద్వారా డోర్నకల్ ప్రాథమిక, ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ్నుంచి కుటుంబసభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వేణు శుక్రవారం మృతి చెందాడు. మృతు డు వేణుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి సోదరుడు వడ్డె రామనర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తోగ్గూడెం పాఠశాలను సందర్శించిన బాలమేళా బృందం

మణుగూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యాస ప్రదర్శన సృజనాత్మకత ప్రతిభను పరిశీలన చేసేందుకు విద్యాశాఖ ఏర్పాటు చేసిన బాలమేళా కమిటీ బృందం శుక్రవారం మండలంలోని తోగ్గూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించింది. పలు అంశాలపై విద్యార్థుల ప్రతిభను పరిశీలించింది. ఈ కమిటీలో జడ్పి హెచ్‌ఎస్ కో ఎడ్యూకేషన్ హెచ్‌ఎం నాగశ్రీ, సిస్టెంటెంట్ సెక్రటరీ కిషోర్, సీఆర్‌పి లక్ష్మన్ ఉండగా కార్యక్రమంలో తోగ్గూడెం హెచ్‌ఎం దబ్బారి రామారావు, ఉపాధ్యాయులు సింగ రవిబాబు, శారద పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

ప్రత్యేక పాఠశాలకు స్థల సేకరణ

అశ్వారావుపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో మండలంలోని కొండరెడ్ల విద్యార్థుల కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక పాఠశాలను నిర్మించాలని తలపెట్టారు. ఈ పాఠశాలకు అవసరమైన స్థల సేకరణకోసం శుక్రవారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఐటీడీఏ డీఈఈ బాపనయ్య, ఎంఈవో ప్రసాదరావు తదితర అధికారుల బృందం పాతరెడ్డిగూడెం గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ ప్రత్యక పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు హాస్టల్, పౌష్టికాహారం అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. గ్రామస్థుల సూచనలతో ఓ స్థలాన్ని సేకరించామని, ఉన్నతాధికారులకు సంబంధిత నివేదికను పంపనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

శివాలయంలో విగ్రహాలకు జలాభిషేకం



జలబిందెలతో వస్తున్న మహిళలు

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీ జగన్నాథపురంలో గల పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం భక్తులు పసుపు బట్టలతో నీటి బిందెలను ఎత్తుకుని ఊరేగింపుగ ఆలయానికి చేరుకుని ప్రతిష్ట విగ్రహాలకు జలాభిషేకం చేశారు. పరిసర గ్రామాల్లోని మహిళలు నీటి బిందెలతో ప్రదక్షణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 10న నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ఆవిష్కరణలు చేపట్టనున్నారు. 10వ తేదీ వరకు ఈ మహోత్సవ కార్యక్రమాలు నిత్యపూజలు నిర్వహించనున్నా రు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎస్. రజనికుమారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిష్ఠలో పాల్గొన్న కొత్వాల..

నూతన శివాలయ ప్రతిష్ఠ మహోత్సవాల్లో జరిగిన ప్రత్యేక పూజలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు హాజరై జలాభిషేకం పూజలో పాల్గొన్నారు. నూతన ప్రతిష్ట విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవాల్లో దేవస్థానం తరఫున భక్తులకు తగు సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొండం వెంకన్న, మాజీ జడ్పీటీసీలు యర్రంశెట్టి ముత్తయ్య, నందా నాయక్, మాజీ ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వర విగ్రహ ప్రతిష్ఠ

» భారీగా తరలివచ్చిన భక్తులు
» ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు



శివకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



దమ్మపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్వారిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర ఆలయంలో కాశీవిశ్వేశ్వర విగ్రహంతో పాటు వేదమాత గాయత్రి అమ్మవారు, విరాట్ విశ్వకర్మ భగవానుడు, నవగ్రహా, సుబ్రహ్మణ్య, దుర్గాదేవి, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు వెల్లటూరి ప్రసాదాచారి ఆధ్వర్యంలో, పూజా కార్యక్రమాలతో పాటు శివకళ్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠా కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసి పైడి వెంకటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ కొయ్యల అచ్యుతరావు, మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ వాసం రాణి , పలువురు మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేలాదిగా తరలి వచ్చిన భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శివస్వాముల భక్త బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సింగరేణిలో హోదాల మార్పు

ఇల్లెందు టౌన్/ రుద్రంపూర్ (సింగరేణి) ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్, బదిలీ వర్కర్ల డిజిగ్నేషన్లను మార్పులు, చేర్పులు చేసినట్లు సింగరేణి కోల్‌మైన్స్ కార్మికసంఘ్ ఇల్లెందు డివిజన్ ఉపాధ్యక్షుడు నాయిని సైదులు తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో అనేకసంవత్సరాలుగా పని చేస్తున్న బదిలీ వర్క ర్, జనరల్ మజ్దూర్ల డిజిగ్నేషన్లను మార్చేవిధంగా తగిన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ నెల 6న రాజస్థాన్‌లో జరిగి న స్టాండింగ్ డైజేషన్ కమిటీ సమావేశం లో కీలక నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. బదిలీ వర్కర్, జనరల్ మజ్దూర్లను అందరిలాగానే తలెత్తుకునే విధంగా జనరల్ అసిస్టెంట్‌గా మార్పులు చేయనున్నట్లు ప్రకటించారు. సింగరేణి ఇన్‌చార్జ్ లక్ష్మరెడ్డి బొగ్గుపరిశ్రమల ఇన్‌చార్జ్ ఆదేశాల మేరకు యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పురుగులమందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....అంకపాలెం గ్రామానికి చెందిన కాకడి బాబురావు (32) జీవితం మీద విరక్తి చెంది గురువారం గ్రామ సమీపంలో పురుగుల మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డా డు. అపస్మారక స్థితిలో ఉన్న బాబూరావును స్థానికులు గుర్తించిన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్థానికంగా ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం వైద్యశాలకు తరలించగా చికిత్స పొందతూ గురువారం రాత్రి ఆయన మృతి చెందాడు. మృతుడు తండ్రి దుర్గయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. బాబురావు బార్య ప్రసవం కోసం సొంత గ్రామం ములకలపల్లి మండలం గంగారం వెళ్లినట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బూర్గంపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన తాటి విజయరాంబాబు(31) ఈ నెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుమ్ముగూడెంలో బాలిక..

దుమ్ముగూడెం ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చదవమని తల్లిదండ్రులు మందలించినందుకు మనస్థాపం చెంది ఆత్మహత్యకు యత్నించిన బాలిక చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందగా, శుక్రవారం దుమ్ముగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. ధర్మారం కొత్తగూడెంకు చెందిన తునికి దివ్యశ్రీ(16) తొమ్మిదో తరగతి వరకు చదివి ఇంటి వద్ద ఖాళీగా ఉంటోంది. పొలం పనులకు రావాలని లేకుంటే చదువుకోవాలని ఖాళీగా ఉండొద్దని తల్లిదండ్రులు మందలించారు. దీంతో జనవరి 26న ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసింది. తొలుత భద్రాచలం ఆసుపత్రిలో చికిత్సలు చేయించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్సల కోసం హైదరాబాదుకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

చికిత్స పొందుతూ చిరువ్యాపారి..

దుమ్ముగూడెం ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):నరసాపురానికి చెందిన చిరు వ్యాపారి షైదీన్(39) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈనెల 2న ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ తూరుబాక ఆర్‌అండ్‌బీ రహదారిపై డైవర్షన్ కోసం వేసిన మట్టికుప్పను ఢీకొని కింద పడి గాయాల పాలయ్యాడు. భద్రాచలం నుంచి నరసాపురం వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. తొలుత భద్రాచలం ఆసుపత్రికి, మెరుగైన చికిత్సల కోసం ఖమ్మం తరలించగా పరిస్థితి విషమించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాఠశాలలో క్షుద్ర పూజలు?

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మర్కోడు మండల పరిషత్ పాఠశాలలో క్షుద్ర పూజలు కలకలం సృష్టించాయి. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులకు పాఠశాల ఆవరణలో పసుపు, నిమ్మకాయ, కోడి, రక్తపు ముద్దలు కనిపించడంతో భయభ్రాంతులకు గురైయ్యారు. పాఠశాలకు ప్రహరి లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మరిందని గతంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా క్షుద్ర పూజాలు చేశారా.. లేక ఎవరైనా కావాలని పాఠశాలలో వేశారా.. అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి..

ఇల్లెందులో బంగారం చోరీ

ఇల్లెందు టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణంలోని స్టేషన్‌బస్తీలో శుక్రవారం తెల్లవారుఝామున చోరీ జరిగింది. స్టేషన్‌బస్తీకి చెందిన ప్రభుత్వ ఉద్యోగి రవి ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని దొంగలు బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ విషయంపై ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

బూర్గంపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నిలిపి ఉంచిన కర్ర లోడు ట్రాక్టరును ద్విచక్ర వాహనం డీకొట్టిన ఘటనలో ఐటీసీ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం...బూర్గంపాడుకు చెందిన అక్తర్ గురువారం రాత్రిలో ద్విచక్ర వాహనంపై విధుల కోసం ఐటీసీ కర్మాగారానికి వెళుతుండగా... గొమ్మూరు వద్ద కర్ర లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను డ్రైవర్ రోడ్డుపై ఉంచాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్ కారణంగా ట్రాక్టర్ కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారుడు ట్రాక్టర్ వెనుక వైపు బలంగా డీకొట్టాడు. ప్రమాదంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా భద్రాచలం తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబసభ్యులు హైదరాబాద్ తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

నాలుగు లీటర్ల గుడుంబా స్వాధీనం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): చుంచుపల్లి మండలంలో నాలుగు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జయశ్రీ శుక్రవారం తెలిపారు.

బాలుడి మర్మాంగాన్ని కొరికిన కుక్క

భద్రాచలం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని కుంటకు సమీపంలో ఉన్న వంజలవాయికి చెందిన వెట్టి లక్ష్మయ్య అనే ఏడేళ్ల ఆదివాసి బాలుడి మర్మాంగాన్ని పెంపుడు కుక్క కరిచింది. దీంతో కుటుంబసభ్యులు శుక్రవారం బాలుడిని భద్రాచలం ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. దీంతో వైద్యులు పరీక్షించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి నిలకడగా ఉంది.

పేరు మార్పు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

» సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన



సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

రుద్రంపూర్, (సింగరేణి) ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేసిన కార్మికులకు సంబంధించిన పేరుమార్పు సమస్యలను వెంటనే పరిష్కరింపచేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. విజిలెన్స్ కేసుల పేరుతో తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పేరు మార్పు కార్మికుల ఆందోళనకు ప్రధాన కార్మికసంఘాలు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు డి. శేషయ్య, వంగా వెంకట్, సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ ఉపాధ్యక్షులు త్యాగరాజన్, కేంద్ర నాయకుడు ఆల్బర్ట్, తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం నాయకులు కాపు కృష్ణ, కూసన వీరభద్రయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సింగరేణిలో 30 సంవత్సరాలకు పైగ సర్వీసు పూర్తి చేసి అనారోగ్య కారణాల వల్ల వారసులకు ఉద్యోగం ఇచ్చేందుకు మెడికల్‌బోర్డుకు దరఖాస్తు చేస్తే విజిలెన్స్ అధికారులు రెండు పేర్లు ఉన్నాయనే నెపంతో సింగరేణి వ్యాప్తంగా 150మందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ ఏరియాలకు సంబంధించిన సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితులు, వివిధ కార్మికసంఘాల నాయకులు రాసూరి శంకర్, తొగరు రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇసుక సర్వేను అడ్డుకున్న గిరిజనులు

చర్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చర్ల మండలం కొయ్యూరు గ్రామంలో మంజూరైన ఇసుక క్వారీకి సంబంధించిన సర్వేను శుక్రవారం స్థానిక గిరిజనులు అడ్డుకున్నారు. కొయ్యూరు గ్రామంలో ఇసుక క్వారీ ఏర్పాటుకు జాయింట్ సర్వేచేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. టీఎస్ఎండీసీ, చర్ల రెవెన్యూ అధికారులు శుక్రవారం సర్వే చేసేందుకు కొయ్యూరు గ్రామానికి వెళ్లారు. ఇదే క్రమంలో 5ఐదు గ్రామాల గిరిజనులు సర్వేను అడ్డుకున్నారు. అధికారులు సర్వే చేయకూండా వెళ్లిపోయారు. సిరాజ్ సొసైటీ, సారాలమ్మ సొసైటీల మధ్య విభేదాలే సర్వే అడ్డుకోవడానికి కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఇదే విషయం చర్ల తహసీల్దార్ శ్రీనివాస్‌ని వివరణ కోరగా కొయ్యూరు పంచాయతీలోని చీమలపాడు, కొయ్యూరు ఇసుక క్వారీలకు చెందిన రెండు సర్వేలు ఒకేసారి కలిపి చెయ్యాలని, లేక పోతే సర్వే చెయ్యవద్దని అక్కడి గిరిజనులు అడ్డుతగిలారని అందుకే జాయింట్ సర్వే నిలిపివేశామన్నారు.

జిన్నెలగూడేన్ని గ్రామ పంచాయతీ చేయాలి

దుమ్ముగూడెం ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పాత జిన్నెలగూడెం, కొత్త జిన్నెలగూడెంలను కలుపుతూ జిన్నెలగూడెం గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని జాతీయ మానవ హక్కుల సంఘం ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నక్కా సాయిబాబు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం చిననల్లబల్లి గ్రామ పంచాయతీలో ఈ రెండు గ్రామాలుండడంతో అభివృద్ధి జరగడం లేదని తెలిపారు. ఎఫ్‌డీసీ చైర్మన్ పొదెం వీరయ్యను కలి సి సమస్యను వివరించడంతో ఏర్పాటుకు అవసరమైన చర్యలను చేపట్టాలని కలెక్టర్‌కు రికమండ్ చేశారని తెలిపారు. జిన్నెలగూడెం గ్రామపంచాయతీ ఏర్పాటు చేయని పక్షంలో వచ్చే పంచాయతీ ఎన్నికల్లో రెండు గ్రామాల ప్రజలు ఓటింగ్‌కు దూరంగా ఉంటారని తెలిపారు.

ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

కొత్తగూడెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతి నెల తనిఖీ చేస్తామని అందులో భాగంగా ఈవీఎం గోడౌన్‌ను సందర్శించినట్టు తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పని తీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవర్ని లోపలికి అనుమతించరాదని అధికారులకు, సెక్యూరిటి గార్డుకు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్ట్రర్‌లో సంతకం చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల సూపరింటెండెంట్లు రంగ ప్రసాద్, దారా ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై అవగాహన తప్పనిసరి: డీఎంహెచ్‌వో

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ప్రీ కన్సెప్షన్స్ అండ్ ప్రీనాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్యూస్ (పీసీపీఎన్‌డీటీ) యాక్ట్‌పై అవగాహన తప్పని సరని వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ సూచించారు. శుక్రవారం ఐడీవోసీలోని డీఎంహెచ్‌వో అడ్వైజరి కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి స్కాన్ సెంటర్‌లో ప్రతి నెల పది ఫార్మ్- ఎఫ్ ఆడిట్ నిర్వహించాలన్నారు. అదే విధంగా క్షేత్ర స్థాయిలో హెల్త్ ఎడ్యుకేటర్లతో ఆడిట్ నిర్వహించాలని తెలియజేశారు. ఆశాలు అందరికి పీసీపీఎన్‌డీటీ యాక్ట్ పట్ల అవగాహన కల్పించాలన్నారు. అనంతరం లింగ నిర్ధారణ, అబార్షన్ రేటుపై సమీక్షించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డెమో ఫైజ్ మోహినుద్దీన్, డీపీఆర్‌వో అస్గర్ హుస్సేన్, వైద్యులు అనూష లక్ష్మీకౌరశ్రీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తగూడెం పట్టణంలోని సఫాయిబస్తీ ప్రాదమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

యోగాతోనే ఆరోగ్యం

జూలూరుపాడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు యోగ చేయటం వల్ల ఏకగ్రత పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతులగా ఉంటారని ఆయూష్ యోగ ట్రైనర్ ప్రమీల తెలిపారు. శుక్రవారం జూలూరుపాడులోని సాయిఎక్స్‌లెంట్ పాఠశాలలో ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు యోగసానాల గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ధ్యానం వల్లన మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆరబోయిన కృష్ణప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ

మణుగూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్లాపురం, విజయనగరం, బెస్తగూడెం గ్రామాలకు చెందిన వృద్ధులకు సింగరేణి ఆధ్వర్యంలో కళ్లజోళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని రామానుజవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం దుర్గం రామచందర్ ముఖ్య అతిథిగా పాల్గొని కళ్లజోళ్లను అందజేశారు. జీఎం మా ట్లాడుతూ.. సింగరేణి ఆధ్వర్యంలో పరిసర గ్రామాల ప్రజల సౌకర్యార్థం పలు మెడికల్ క్యాంపులను నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అయోధ్య, రమేష్, ఉన్నతాదికారులు శ్యాంసుందర్, ఎస్ రమేష్, డాక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

కేటీపీఎస్ కెనాల్‌లో మొసలి ప్రత్యక్షం

భయాందోళనకు గురైన ప్రజలు..



కెనాల్‌లో కనిపించిన మొసలి

పాల్వంచరూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కిన్నెరసాని జలాశయంలో నుంచి కేటీపీఎస్‌కు నీటిని మళ్లించే కేనాల్ మొసలి ప్రత్యక్షం కావడంతో ప్రజలు భయాందోళన చెందారు. శుక్రవారం కొంతమంది పర్యాటకులు కెనాల్‌లో ఉన్న మొసలిని చూసి ఆశ్యర్యానికి గురయ్యారు. ఈ విషయాన్ని పక్కనే ఉన్న అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎఫ్ఎస్ఓ కిషన్ ఎఫ్‌బీవో రాములు మునలిని చూసి సమీపంలో ఉన్న కొంతమంది జాలర్లను పిలిపించారు. వలలు వేసి మొసలిని పట్టుకుని వడ్డుకు చేర్చారు. అనంతరం మునలిని తిరిగి కిన్నెర జలశయంలో వదిలివేశారు.

ఇసుక అక్రమ తోలకాలను అరికట్టాలి

కరకగూడెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవాగులో వాల్టా చట్టానికి విరుద్ధంగా రాత్రి పగలు తేడా లేకుండా అక్రమ ఇసుక తోలకాలు జరుగుతున్నాయని అక్రమ తోలకాలను నిలిపివేయాలని సీపీఎం మండల కన్వీనర్ కొమరం కాంతారావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అక్రమ తోలకాలను తక్షణమే నిలిపివేసి పంచాయతీలో ఇసుక కూపన్ల విధానాన్ని తీసుకురావాలన్నారు. పెద్దవాగులో ఇసుక తోలకాలు గోదావరి ఇసుక ర్యాంపుల స్థాయిలో జరుగుతున్నాయని ఇంత పెద్ద ఎత్తున ఇసుక తోలకాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోక పోవడం సరికాదన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పంచాయితీల ఆధ్వర్యంలో ఇసుక తోలకాలు జరపాలని కోరారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఇస్కాన్ పూజలు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట పట్టణంలోని శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఇస్కాన్ ప్రతినిధులు ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుడికి జరిగిన ప్రత్యేక పూజలు, ఆటలు, పాటలు భక్తులను అలరించాయి. బీహార్‌నుంచి వచ్చిన 11 మంది ఇస్కాన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి గీతాలు పారాయణం చేసారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్తా సుమాకర్ ఆధ్వర్యంలో ఇస్కాన్ ప్రతినిధులకు, పూజలకు ప్రత్యేక వసతులు కల్పించారు. పూజలు అనంతరం 400 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు వందలాదిగ భక్తులు తరలివచ్చారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



పార్టీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న దుర్గాప్రసాద్

చర్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్ గుర్తు చేశారు. శుక్రవారం కుదునూరు, వీరాపురం గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు దుర్గాప్రసాద్ ఆధ్యర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్యర్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకు పోతుందన్నారు. రాష్ట్రం లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చీమల మర్రి మురళికృష్ణ, ఆవుల విజయభాస్కర్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు సోడి చలపతి, మహిళా అధ్యక్షురాలు పద్మజ, ఇందల బుచ్చిబాబు, ఇర్పా శ్రీనివాసరావు, సతీష్, విద్యాసాగర్, రాకేష్, బాలకృష్ణ, చంటి, భాస్కర్, సత్తిబాబు తదితరులు ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఈవో

దుమ్ముగూడెం ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఈవో రమాదేవి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టుచీర, రూ.5వేల నగదునందజేశారు. ఆలయ కమిటీ ఈవోను సన్మానించారు. శుక్రవారం అమ్మవారికి గ్రామంలోని ఆడపడుచులు తెచ్చిన 101 బిందెల గోదావరి జలాలతో అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా దుమ్ముగూడెం శ్రీ ఆత్మారామచంద్రస్వామి వారి ఆలయాన్ని ఈవో రమాదేవి దర్శించుకొని రూ.3వేలు కానుకగా అందజేశారు. వందలాది ఎకరాల ఆలయ భూములు అన్యాక్రాంతమవడంతో దేవాలయ అభివృద్ధి జరగడం లేదని గ్రామస్థులు ఈఓ దృష్టికి తీసుకెళ్లారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

» వైద్యులు సమయం పాటించాలి » ఐటీడీఏ పీవో రాహుల్ » మోరంపల్లి బంజర పీహెచ్‌సీ తనిఖీ



మోరంపల్లి బంజరలో రోగులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం/బూర్గంపాడు ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ప్రభుత్వ ఏరియా వైద్యశాలను ఐటీడీఏ పీవో బి.రాహుల్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. వైద్యశాలలో వివిధ విభాగాల్లో రికార్డులను పరిశీలించడంతో పాటు వార్డుల్లోని రోగులతో వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం పీవో రాహుల్ మాట్లాడుతూ వైదులు సమయం పాటించాలని ఆదేశించారు. టెస్టుల కోసం ఎవరిని బయటకు పంపించకూడదని, డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. గర్బిణులు ఏ సమయంలోనానైనా కాన్పు కోసం ఆసుపత్రికి వచ్చినప్పుడు తప్పనిసరిగా ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి సాధారణ ప్రసవం అయ్యేలా చూడాలని, లింగ నిర్దారణ పరీక్షలు పొరపాటున చేయకూడదని ఆదేశించారు. గర్బిణీ స్త్రీల విసయంలో వార్డు సిబ్బంది, వైద్యులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి నెల స్టిల్ బర్త్ కేసులను ఆన్‌లైన్ చేయాలని, ఓపీకి సంబంధించిన రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆసుపత్రిలో అన్ని జబ్బులకు సరిపడా మందు లు అందుబాటులో ఉంచుకోవాలని, మందుల కొనుగోలు కోసం రోగులను బయటకు పంపొద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ చైతన్య, ఆసుపత్రి పర్యవేక్షకులు రామకృష్ణ, ఆర్ఎంవో సంతోష్‌కుమార్, ఆయుష్ వైద్యులు డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

బూర్గంపాడు, (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంత పీహెచ్‌సీలలో పనిచేసే డాక్టర్లు, సిబ్బంది సమయం పాటించి రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శుక్రవారం బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర పీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనీకఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఓపి, డెలివరీ, మందులకు సంబందించిన రికార్డులను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సౌకర్యాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయం పాటించి ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్య సౌకర్యం అందించాలని అన్నారు. నార్మర్ డెలివరీల సంఖ్య పెరగాలని తెలిపారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి పీహెచ్‌సీలో సరైన వైద్యం అందించేలా చూడాలని రోగనిర్ధారణ పరీక్షల కొరకు బయట ల్యాబ్‌లకు ఎవరిని రెఫర్ చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, పీహెచ్‌సీ వైద్యు లు సాహితి, మధుబాల, సిబ్బంది పాల్గొన్నారు.